ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేది: 07.04.2026 సమయం: 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. కేంద్ర ప్రభుత్వం గడువు ముగిశాక జ్యుడిషియల్ కమిషన్ వేసి జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, మండలాల సరిహద్దుల సమస్యలు పరిష్కరించే ప్రయత్నం చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

2. హైదరాబాద్ లోని నిమ్స్ క్యాన్సర్ బ్లాక్‌లో సుమారు 33 కోట్ల రూపాయలతో ఏర్పాటు చేసిన అత్యాధునిక లీనాక్ సేవలను ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఈ ఉదయం ప్రారంభించారు.

3. హైదరాబాద్ లో ఇందిరమ్మ క్యాంటీన్ ల పనితీరుపై త్వరలోనే అధికారులతో సమీక్ష నిర్వహిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు.

4. అనుమతి లేకున్నా పరిగి పర్యటనకు వెళ్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావును కొద్ది సేపటి క్రితం పోలీసులు అప్పా జంక్షన్ వద్ద అరెస్ట్ చేశారు.

**రేవంత్**

కేంద్ర ప్రభుత్వం వచ్చే యేడాది మార్చి 31 వరకు జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, మండలాల సరిహద్దులు మార్చవద్దని గడువు విధించిందని, అది ముగిసిన తర్వాత జ్యుడిషియల్ కమిషన్ వేసి సమస్యలను పరిష్కరించే ప్రయత్నం చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. త్వరలో తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత-చేవెళ్ల పనులు ప్రారంభిస్తామన్నారు. సీఎల్పీ నేతగా భట్టి

విక్రమార్క ఆదిలాబాద్ జిల్లా పిప్పిరి నుంచి మూడేళ్ల క్రితం ప్రారంభించిన పీపుల్స్ మార్చ్ పాదయాత్రను పురస్కరించుకొని 'ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక'లో భాగంగా నిన్న నిర్వహించిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం అంటే రాజకీయ విలువలకు వేదిక అని, ఏది పడితే అది మాట్లాడితే పేదలకు అన్యాయం జరుగుతుందని, అలా జరగకుండా ఉండాలనే తమ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు.

**డెస్క్**

**నిమ్స్ క్యాన్సర్**

హైదరాబాద్ లోని నిమ్స్ క్యాన్సర్ బ్లాక్‌లో సుమారు 33 కోట్ల రూపాయలతో ఏర్పాటు చేసిన అత్యాధునిక లీనాక్ సేవలను ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఈ ఉదయం ప్రారంభించారు. దీంతో, TrueBeam సిస్టమ్ ద్వారా ట్యూమర్‌పై మాత్రమే ప్రభావం చూపించే ఖచ్చితమైన రేడియేషన్ చికిత్స ఇప్పుడు పేద రోగులకూ అందుబాటులోకి వచ్చింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రతి ఏటా 55 నుంచి 60 వేల కొత్త కేన్సర్ కేసులు నమోదవుతున్న నేపథ్యంలో.. అన్ని జిల్లా కేంద్రాల్లో డే కేర్ కేన్సర్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని, బాలికలకు ఉచితంగా HPV టీకా వేయిస్తున్నామని, 46 లక్షల స్వయం సహాయక సంఘాల మహిళలకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే కేన్సర్‌ను నోటి ఫైబుల్ వ్యాధిగా ప్రకటిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ పాల్గొన్నారు.

**డెస్క్**

**పొన్నం పీపుల్స్ పల్స్**

హైదరాబాద్ లో ఇందిరమ్మ క్యాంటీన్ ల పనితీరుపై పీపుల్స్ పల్స్ రీసెర్చ్ సంస్థ మంత్రి పొన్నం ప్రభాకర్ కి 60 పేజీల నివేదికను ఈరోజు సమర్పించింది. సంస్థ డైరెక్టర్లు ఆర్. దిలీప్ రెడ్డి, జీ. మురళి కృష్ణ నివేదికను సమర్పించిన సందర్భంగా ఈ అంశంపై జీహెచ్ ఎంసీ కమిషనర్ తో మంత్రి మాట్లాడారు. త్వరలోనే ఇందిరమ్మ క్యాంటీన్ లపై అధికారులతో సమీక్ష నిర్వహిస్తామని పొన్నం ప్రభాకర ఈసందర్భంగా చెప్పారు.

పీఎస్

**తుమ్మల**

కోహెడ పండ్ల మార్కెట్ భూముల గురించి మాజీ మంత్రి హరీశ్ రావు చేసిన ఆరోపణలపై వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తీవ్రంగా స్పందించారు. కోహెడ మార్కెట్ భూములను అమ్మే నిర్ణయం ప్రభుత్వం తీసుకోలేదని స్పష్టం చేశారు. హరీశ్ రావు చేస్తున్న ప్రచారం పూర్తిగా నిరాధారమని, ఇది రైతులను తప్పుదోవ పట్టించే రాజకీయ ప్రయత్నమేనని మంత్రి మండిపడ్డారు. అగ్రి ఎగుమతులు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ద్వారా రైతుల పంటలకు అంతర్జాతీయ మార్కెట్లో అవకాశాలు కల్పిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

డెస్క్

**హరీష్ అరెస్ట్**

మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసన సభా పక్ష ఉప నేత హరీశ్‌రావు పరిగి పర్యటనపై పోలీసులు ఆంక్షలు విధించారు. ఇండస్ట్రియల్ పార్క్ భూ బాధిత రైతులను పరామర్శించేందుకు వెళ్లకుండా హరీశ్‌రావును ఉదయం హైదరాబాద్‌లోనే గృహ నిర్బంధం చేశారు. తర్వాత హరీష్ రావు పోలీసుల నుంచి తప్పించుకొని పరిగి పర్యటనకు బయల్దేరారు. దీంతో ఆయనను అప్పా జంక్షన్ వద్ద పోలీసులు అరెస్ట్ చేశారు. హరీష్ రావు తో పాటు మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి ఎర్రబెల్లి దయాకర్ రావు, మాజీ ఎమ్మెల్యే వెంకటేశ్వర్ రెడ్డిని కూడా అరెస్ట్ చేశారు.

డెస్క్, హైదరాబాద్

**నీరజ్ మిట్టల్**

కేంద్ర పెట్రోలియం శాఖ కార్యదర్శి డాక్టర్ నీరజ్ మిట్టల్, అన్ని రాష్ట్రాల ముఖ్య కార్యదర్శులకు నిన్న లేఖ రాశారు. వలస కూలీలకు అందించే 5 కిలోల సిలిండర్ల సరఫరాను రెట్టింపు చేయాలని ఆ లేఖలో ఆదేశించారు. OMCల సహాయంతో ఈ పంపిణీ జరుగుతుందని పేర్కొన్నారు.

పీఎస్

**డిజిటల్ వివరాలు**

ప్రజలు డిజిటల్ విధానంలో చేసే చెల్లింపుల వివరాల సేకరణకు సంబంధించి చట్టం తెచ్చేందుకు ఉన్న అవకాశాలపై అధ్యయనానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో కమిటీని ఏర్పాటుచేసింది. ఈ మేరకు రాష్ట్ర వాణిజ్యపన్నుల శాఖ నిన్న ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ ఆదాయం పెంచుకునేందుకు డిజిటల్ చెల్లింపులకు సంబంధించిన డేటా సేకరించి.. సమాచారాన్ని కొంతకాలం నిల్వ చేసుకోవడానికి చేపట్టాల్సిన చర్యలపై ఈ కమిటీ అధ్యయనం చేయాలని ఆదేశించింది. 30 రోజుల్లో ప్రాథమిక నివేదిక, 60 రోజుల్లో తుది నివేదికను సమర్పించాలని పేర్కొంది.

**డెస్క్**

**బ్రేక్**

**డీజీపీ టూర్**

ములుగు జిల్లాలోనీ కర్రెగుట్టల ప్రాంతంలో ఇవాళ రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి పర్యటించనున్నారు. ముర్మూరు నుండి తడపల వరకు జరుగుతున్న రోడ్డు పనులను పరిశీలించి, పామునూరు సీఆర్పీఎఫ్ బేస్ క్యాంప్‌ను సందర్శిస్తారు.ఈ పర్యటనలో అటవీశాఖ అధికారితో కలిసి సరిహద్దు ప్రాంతాలను పర్యవేక్షించడమే కాకుండా, గుత్తి కోయలతో ఏర్పాటు చేసిన 'కమ్యూనిటీ కాంటాక్ట్' ప్రోగ్రాంలో డీజీపీ పాల్గొంటారు. డీజీపీ రాకతో కేంద్ర బలగాలు, పోలీసులు సరిహద్దు అడవుల్లో భారీ భద్రతను ఏర్పాటు చేశారు.

**పీటీసీ - హైదరాబాద్**

**తుమ్మల**

రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ శాఖ, ఇక్రిశాట్ ఆధ్వర్యంలో కొడంగల్ నియోజకవర్గ రైతులకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని సంగారెడ్డి జిల్లా లోని ఇక్రిశాట్ వ్యవసాయ క్షేత్రంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... రైజింగ్ తెలంగాణ 2045 లక్ష్యాలకు అనుగుణంగా వ్యవసాయ రంగాన్ని

ఆధునీకరించడం, అగ్రిటెక్ వినియోగాన్ని ప్రోత్సహించడం, లాభసాటి పంటలు, పంటల విలువ, వృద్ధి ద్వారా రైతుల ఆదాయాన్ని పెంచడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు.

**పీటీసీ – సంగారెడ్డి**

**కేటీఆర్**

హరీష్ రావు అరెస్ట్ పై బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు తారక రామారావు ప్రభుత్వంపై తీవ్రంగా విరుచుకుపడ్డారు. హరీశ్ రావు, సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మహేష్ రెడ్డి, నరేందర్ రెడ్డి, మెతుకు ఆనంద్ అక్రమంగా అరెస్టు చేయడం సరైంది కాదని ఆయన అన్నారు. గొంతులు నొక్కడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమన్నారు. బెదిరింపులకు భయపడేది లేదని, ప్రజల పక్షాన పోరాటం ఆగదని హెచ్చరించారు.

**పీఎస్**

**సలేశ్వరం యాత్ర**

నాగర్ కర్నూల్ జిల్లాలోని పవిత్రమైన సలేశ్వరం యాత్రలో అగ్ని మాపక, విపత్తు స్పందన, అత్యవసర, పౌర రక్షణ శాఖ సిబ్బంది ప్రశంసనీయమైన సేవలు అందించినట్లు ప్రజా సంబంధాల అధికారి ధనుంజయ్ రెడ్డి తెలియజేశారు. దట్టమైన అడవుల మధ్య వెలసిన ఈ ఆలయంలో ఈనెల 1 నుండి 3వ తేదీ వరకు జాతర జరిగింది. కఠినమైన కొండదారులు, అడవి మార్గంలో సాహసోపేతంగా ఉండే ఈ యాత్రకు వచ్చిన భక్తులకు ఫైర్ సిబ్బంది ట్రెక్కింగ్ లో సహాయం చేయడంతో పాటు.. అత్యవసర సేవలు, ప్రథమ చికిత్స సేవలు అందించినట్లు వివరించారు. ఈ యాత్రలో సేవలందించిన వారిని ఫైర్ సర్వీసెస్ డైరెక్టర్ జనరల్ విక్రమ్ సింగ్ మాన్ ప్రత్యేకంగా అభినందించినట్లు పేర్కొన్నారు.

**జీఎస్**

**చర్యలు**

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని, రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రం డిఎస్ పీ నాగేంద్ర చారి అన్నారు. పట్టణంలోని సిక్ వాడలో పోలీసులు కమ్యూనిటీ కాంటాక్ట్

కార్యక్రమాన్ని నిర్వహించి సరైన పత్రాలు నెంబర్ ప్లేట్లు లేని 23 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా డిఎస్ పీ నాగేంద్ర చారి మాట్లాడుతూ...

**బైట్ - డీఎస్పీ**

**పీటీసీ - సిరిసిల్ల**

**ప్రపంచ ఆరోగ్య దినోత్సవం**

ఈరోజు ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని జరుపుకుంటున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ స్థాపన దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి సంవత్సరం ఏప్రిల్ 7న దీనిని జరుపుకుంటారు. ఈరోజు, ఆరోగ్య అవగాహన, నివారణ చర్యలు, మానసిక శ్రేయస్సుపై దృష్టి పెడతారు.

**జీఎస్**

**ఆరోగ్య దినోత్సవం**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా వరంగల్ జిల్లాలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఆరోగ్యమే మహాభాగ్యం అన్న అంశంపై ఎంజీఎం రెండవ గేట్ నుండి ట్రాఫిక్ సిగ్నల్ వరకు వరల్డ్ హెల్త్ డే ర్యాలీ నిర్వహించారు. ఆరోగ్యంపై ర్యాలీ ప్రారంభించి ఆరోగ్యంగా ఉండవలసిన అవసరాన్ని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద తెలియజేశారు.

పిటిసి, వరంగల్

**బాన్సువాడ ఆస్పత్రి**

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఎక్కువ కాన్పులు నిర్వహించి, బాన్సువాడ ఆస్పత్రి రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఆసుపత్రిగా ఎంపికైందని సూపరింటెండెంట్, డాక్టర్ విజయ భాస్కర్ తెలిపారు. హైదరాబాద్ లోని రవీంద్ర భారతిలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజ నరసింహ చేతుల మీదుగా ఈ అవార్డు అందుకోనున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయ భాస్కర్ మాట్లాడుతూ... ఈ అవార్డు తమ బాధ్యతను మరింత పెంచిందని..

ఆసుపత్రిలో పని చేస్తున్న ప్రతి ఒక్క ఉద్యోగికి ఈ అవార్డు అంకితమిస్తున్నట్టు ఆయన తెలిపారు.

**పీటీసీ - కామారెడ్డి**

**ఆహార భద్రత**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఆహార భద్రతపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆహార భద్రత అధికారి శరత్ తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా అవగాహన ర్యాలీలు నిర్వహిస్తారు.

**పీటీసీ - భద్రాద్రి**

**మహిళల భద్రత**

ఆసిఫాబాద్ జిల్లాలో మహిళలు, చిన్నపిల్లల భద్రత కోసం పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని పోలీసు సూపరింటెండెంట్ నితికా పంత్ తెలిపారు. షీ టీం, యాంటీ ఉమెన్ ట్రాఫికింగ్ టీం, భరోసా కేంద్రాల ద్వారా మహిళల రక్షణకు కృషి కొనసాగుతోందని తెలిపారు.

**పీటీసీ - ఆసిఫాబాద్**

**వాతావరణం**

ఈరోజు, రేపు, ఎల్లుండి రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో అక్కడక్కడా తేలికపాటి నుండి మోస్తారు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని ప్రాంతీయ వాతావరణ కేంద్రం తెలియజేసింది. ఉరుములు, మెరుపులు. 30 నుండి 40 కిలో మీటర్ల వేగంతో ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురవొచ్చని పేర్కొంది.

**పీఎస్**